క్లుప్తంగా

నేడు వేంకటేశ్వరుని జన్మనక్షత్ర పూజలు

కపిలేశ్వరపురం: అంగరలోని అలివేలు మంగ, గోదాదేవీ సమేత శ్రీవైభవ వేంకటేశ్వరస్వామి జన్మ నక్షత్ర పూజలను మంగళవారం ఆలయం లో నిర్వహించనున్నట్టు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఆలయ ప్రధాన అర్చకుడు బాలబాలాజీ ఆధ్వర్యంలో స్వామికి పంచామృతాభిషేకం పూజలు చేయనున్నారు.

ప్లాస్టిక్ నిషేధంపై ర్యాలీలు



ప్లాస్టిక్ వ్యర్థాల ప్రమాదాన్ని వివరిస్తున్న వెల్ఫేర్ అసిస్టెంట్ నవీన్ తదితరులు

కపిలేశ్వరపురం: సింగిల్ యూజ్ ప్లాస్టిక్ సరుకులు సమాజానికి ప్రమాదకరమంటూ మండలంలోని 19 గ్రామాల్లో అవగాహన ర్యాలీలు నిర్వహించారు. సచివాలయ ఉద్యోగులు ఇంటింటికీ వెళ్లి ప్లాస్టిక్ వ్యర్థాలు పర్యావరణ విఘాతానికి కారణమయ్యే తీరును వివరించారు. ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి పర్యవేక్షణలో గ్రామాల కార్యదర్శులు ఆధ్వర్యంలో ప్లాస్టిక్ వ్యర్థాల తరలింపు కార్యక్రమం చేపట్టారు. వాకతిప్ప, తాతపూడి, కపిలేశ్వరపురం, కోరుమిల్లి గోదావరి రేవులను శుభ్రపర్చారు. అంగర, పడమర ఖండ్రిక, వెదురుమూడి, వల్లూరు, నేలటూరు, కాలేరు, వడ్లమూరు, నల్లూరు, వాకతిప్ప, టేకి తదితర గ్రామాల్లో ఇంటింటి పర్యటన చేపట్టారు. వ్యాపార దుకాణాల్లో ప్లాస్టిక్ నిషేధానికి సంబంధించిన నోటీసులను అందజేశారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు, పారిశుద్ధ్య కార్మికులు, వైద్య, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

ట్రై సైకిల్ బహూకరణ



సత్యనారాయణకు ట్రై సైకిల్‌ను బహూకరిస్తున్న డీఎస్పీ ప్రసాద్ తదితరులు

రామచంద్రపురం: ప్రమాదవశాత్తు కాళ్లు పని చేయని స్థితిలో ఉన్న వ్యక్తికి లయన్స్ క్లబ్ నేతృత్వంలో ట్రై సైకిల్‌ను బహూకరించారు. పట్టణంలో లయన్స్ కల్యాణ మండపం వద్ద సోమవారం జరిగిన కార్యక్రమంలో బిక్కవోలు మండలం ఇల్లపల్లికి చెందిన మేడిశెట్టి సత్యనారాయణకు రెండు కాళ్లు పనిచేయని స్థితిలో ఉండగా అతనికి లయన్స్ క్లబ్ జోన్ల్ చైర్ పర్సన్ కొవ్వూరి వంశీమోహన్‌కృష్ణారెడ్డి ఆర్థిక సౌజన్యంతో రూ.10 వేల విలువ చేసే ట్రై సైకిల్‌ను రామచంద్రపురం డీఎస్పీ టీఎస్ఆర్‌కే ప్రసాద్ చేతుల మీదుగా అందజేశారు. క్లబ్ అధ్యక్షుడు జేఎస్ఎస్ గోపాలకృష్ణ, కోశాధికారి విశ్వతేజ, గుణ్ణం రామకృష్ణ, ఎల్ఎస్ఎస్ ప్రకాశరావు, కొండపల్లి రవికుమార్, గోలి చిట్టిబాబు, వెంకటగిరి, జి.మామిడాడ క్లబ్ అధ్యక్షుడు కడియాల శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

దేశ ఔన్నత్యాన్ని కాపాడుకోవాలి



మాచరలో విద్యార్థినికి మట్టిని అందజేస్తున్న హెచ్ఎం రమాదేవి

కపిలేశ్వరపురం: మహనీయుల త్యాగాలతో నిర్మితమైన భారతదేశ చారిత్రక ఔన్నత్యాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని మాచర జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం రమాదేవి అన్నారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ ఉత్సవాల్లో భాగంగా పాఠశాల విద్యార్థులు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. నా మట్టి నా దేశం పేరుతో దేశ చారిత్ర ఔన్నత్యాన్ని తెలియజేస్తూ నినాదాలు చేశారు. పవిత్రమైన కుండలో మట్టిని సేకరించి తమ దేశ భక్తిని చాటుకున్నారు. జాతీయ నాయకులు త్యాగాలను తెలియజేస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. వారి కృషిని హెచ్ఎం రమాదేవి, ఉపాధ్యాయులు వెంకట్, వాడ్రేవు శ్రీనివాసరావు, రాజశేఖర్ భీమారావు అభినందించారు.

ఘనంగా దీపోత్సవాలు



స్వామివారికి పూజలు నిర్వహిస్తున్న చైర్‌పర్సన్ దుర్గారాణి, రాజుబాబు, శ్రీకృష్ణ తదితరులు

మండపేట: గణపతి నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి పలు ఉత్సవ కమిటీలు దీపోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. గణపతి మండపాల వద్ద దీపారాధనలు నిర్వహించి, స్వామివారికి పూజలు చేశారు. స్థానిక 26వ వార్డులో జరిగిన వేడుకలకు మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి, వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి రెడ్డి రాజుబాబు, యువజన విభాగం నేత చోడే శ్రీకృష్ణలు ముఖ్య అతిథులుగా హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం దీపోత్సవాన్ని ప్రారంభించారు. కౌన్సిలర్లు అమలదాసు లక్ష్మి, నీలం దుర్గ, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం.. అప్రమత్తతే ప్రధానం

- సంతర్పణ కారాదు సమస్య
- వినాయక విగ్రహ నిమజ్జనం వేళ జరభద్రం
- అధికారుల ఆదేశాలే శ్రీరామరక్ష



తాతపూడి గోదావరి రేవులో పడవపై విగ్రహాన్ని నిమజ్జనం చేస్తున్న దృశ్యం (ఫైల్)

కపిలేశ్వరపురం: ఆధ్యాత్మికం అంటే పూజలే కాదు.. ఆరోగ్యకరమైన విషయాలు ఎన్నో దాగి ఉన్నాయి. పూజలు అనగానే అందరూ ఇంటిని, ఒంటిని శుభ్రం చేసుకోవడం, అందరితో కలిసి ఐకమత్యంతో పూజా కార్యక్రమాల్లో పాల్గొనం వంటివి చేస్తారు. దీనివల్ల సంతోషంగా ఉండడంతో ఆరోగ్యం మెరుగుపడుతుంది. అయితే ఈ పూజా కార్యక్రమాల్లో జాగ్రత్తలు కూడా అవసరం. ఎలాంటి అవరోధాలు జరగకుండా చూసుకోవాలి.

ప్రస్తుతం వినాయక చవితి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. స్థానిక ప్రజల ఆధ్యాత్మిక, వినోదాల మేళవింపునకు ప్రతీకగా చవితి పందిళ్ల వేసి పూజలు చేస్తారు. ఈ నెల 18న చవితి ప్రారంభ పూజలు విజయవంతంగా సాగాయి. ఆ రోజు నుంచి 3, 5, 9, 11 రోజుల్లో శిబిరంలో ప్రతిష్ఠించిన స్వామి విగ్రహాలను నదిలో నిమజ్జనం చేస్తారు. నిమజ్జనం చేయడమూ, అనంతరం అన్న సంతర్పణలను నిర్వహించడమూ అత్యంత కీలకమైనవి. వాటి వెనక ప్రజల ప్రాణాలు, ఆరోగ్య అంశాలు ముడిపడి ఉన్నాయి. అందువల్ల ఉన్నతాధికారుల సూచనలను తూచ తప్పకుండా పాటించాల్సిన అవసరాన్ని నిర్వాహకులు గుర్తించాలి. నిమజ్జనంలో ప్రమాదాలు సంభవించకుండా జాగ్రత్త వహించాలి. వందల మందికి ఒకేసారి వడ్డన చేసే అన్న సంతర్పణలో ఆరోగ్య సూత్రాలను పాటించాలి.

నిమజ్జనంలో..

గతంలో డప్పు వాయిద్యాలు, కోలాట నృత్యాలతో ఊరేగింపుగా గణనాథున్ని తరలించేవారు. ఆధునిక కాలంలో సాంకేతికతతో కూడిన వాయిద్యాలను వినియోగించడంతో నిమజ్జన కార్యకర్తల్లో ఉత్సాహం మరింత ఉరకలు వేస్తోంది. పరిసరాలను పట్టించుకోకుండా గెంతులేస్తుంటారు. ఈ సమయంలో మద్యం సేవించే వారిని నిమజ్జన కార్యక్రమానికి దూరంగా ఉంచాలి. అధికారులు సూచించిన గోదావరి, కాలువ రేవుల్లోనే నిమజ్జనం చేయాలి. నది లోతుకు దిగడం, ఈతకు వెళ్లడం చేయకూడదు. వాహనాల్లో విగ్రహాలను అమర్చేటప్పుడు, తరలించేటప్పుడు విద్యుదాఘాతానికి గురికాకుండా చూడాలి. వాహనాలను వేగ నియంత్రణతో నడపాలి. రాకపోకలు సాగించేవారిపై రంగులు చల్లుతూ గొడవలకు గురికాకుండా జాగ్రత్త వహించాలి.



అన్నసమారాధనలో ప్లాస్టిక్ పరదాపై వండి వార్చిన అన్నం

అన్న సమారాధనల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు

ఉత్సవాల ముగింపు సందర్భంగా రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల్లో వేలాది మందికి అన్నదానం చేస్తున్నారు. ఈ అన్నదానంలో శుచి శుభ్రత పాటించాలి. సురక్షితమైన తాగునీటిని సరఫరా చేయాలి. భక్తులను భోజనం చేసే ముందు చేతులను శుభ్రపర్చుకునేలా ఏర్పాట్లు చేయాలి. వడ్డించేవారు తరచూ చేతులను పరిశుభ్రం చేసుకోవాలి. వండిన పదార్థాలపై మూతలు ఉండేలా చూడాలి. ప్లాస్టిక్ సామగ్రి వాడకాన్ని తగ్గించాలి.

వ్యక్తిగత, పరిసరాల శుభ్రతకు ప్రాధాన్యం



అన్న సంతర్పణ నిర్వహణలో తాగునీరు, వడ్డించే పదార్థాలు, పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలి. వడ్డించేవారు, భుజించేవారు విధిగా వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి. లేకుంటే అనారోగ్యంపాలయ్యే అవకాశం ఉంటుంది. ఆహారం కలుషితమైతే వికారం, వాంతికావడమనే లక్షణాలు కనిపిస్తాయి. ఆరోగ్య సమస్యలను గుర్తిస్తే వెంటనే ఆసుపత్రికి సమాచారం ఇవ్వాలి.

– పి.రత్నకుమారి, వైద్యాధికారి, అంగర పీహెచ్‌సీ, కపిలేశ్వరపురం మండలం

పేదల ఇంటికెళ్లి.. ఆరోగ్య సమస్యలు తెలుసుకొని..



అంగరలో ఆరోగ్య సమస్యలను అడిగి తెలుసుకుంటున్న పీహెచ్‌సీ హెచ్ఈ రామారావు

కపిలేశ్వరపురం: మండలంలోని 19 గ్రామాల్లో సోమవారం వైద్య ఆరోగ్య కార్యకర్తలు పేద, మధ్య తరగతి ప్రజల ఇంటింటికి వెళ్లి వారి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నవారికి బీపీ, హెమోగ్లోబిన్ తదితర ఏడు రకాల పరీక్షలను చేశారు. ఫలితాలను లబ్ధిదారుని కేస్ షీట్‌లో నమోదు చేశారు. అవసరమైన వారికి మెరుగైన పరీక్షలు చేసి చికిత్సనందించనున్నట్టు వైద్యాధికారి పి.రత్నకుమారి తెలిపారు. త్వరలో నిర్వహించబోయే వైద్య ఆరోగ్య శిబిరాల్లో ప్రజలు మెరుగైన చికిత్సను పొందవచ్చన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ హెచ్ఈ బి.రామారావు, ఎంఎల్‌హెచ్‌పీ కె.రమాదేవి, హెచ్‌వీ తాతపూడి మేరీమణి, ఎంపీహెచ్ఈఓ జుత్తుక మల్లికార్జునుడు, వైద్య ఆరోగ్య కార్యకర్త వెన్నేటి వెంకటేశ్వర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి త్రోబాల్ పోటీలకు గొల్లపాలెం విద్యార్థులు



రాష్ట్ర స్థాయి త్రోబాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులతో స్కూల్ వ్యాయామ ఉపాధ్యాయుడు సునీల్

కాజులూరు: రాష్ట్ర స్థాయి త్రోబాల్ పోటీలకు కాజులూరు మండలం గొల్లపాలెం జెడ్పీ పాఠశాల నుంచి ఇద్దరు మంది విద్యార్థులు ఎంపికై నట్టు స్కూల్ వ్యాయామ ఉపాధ్యాయుడు జి.సునీల్ తెలిపారు. పాఠశాలలో ఆయన మాట్లాడుతూ అనపర్తిలో సోమవారం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా స్కూల్ గేమ్స్ ఆటల పోటీలు జరిగాయన్నారు. ఈ పోటీల్లో తమ పాఠశాల నుంచి పలువురు విద్యార్థులు త్రోబాల్ పోటీలలో పాల్గొని చక్కటి ప్రతిభ కనపరిచారన్నారు. వీరిలో అండర్-17 బాలికా విభాగం నుంచి నూకెళ్ల మనీషా, అండర్-14 బాలికా విభాగం నుంచి మాత ఈశ్వరి జిల్లా టీంలకు ఎంపికయ్యారన్నారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులకు, వారికి శిక్షణ నిచ్చిన పీఈటీ జి.సునీల్‌లను సర్పంచ్ పోతురాజు ప్రసన్నమౌనిక, ఉప సర్పంచ్ తాడి భువనేశ్వరిదేవి, ఎంపీటీసీ జొన్నకూటి పద్మజా, పీఎంసీ చైర్మన్ మాత నాగరాజు, పాఠశాల సిబ్బంది గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

శలపాక జంక్షన్‌లో బస్‌షెల్టర్ నిర్మించాలి

కాజులూరు: కాకినాడ-కోటిపల్లి రహదారిలో గొల్లపాలెంలోని శలపాక జంక్షన్ వద్ద బస్‌షెల్టర్ నిర్మించాలని ప్రయాణికులు కోరుతున్నారు. మండలంలోని 10 గ్రామాలకు కూడలి అయిన ఈ సెంటర్‌లో గొల్లపాలెం, డేగలపేట, శలపాక, తణుకువాడ, మంజేరు తదితర గ్రామాల నుంచి నిత్యం వందల సంఖ్యలో ప్రయాణికులు కాలినడకన, సైకిళ్లపై వచ్చి బస్సులెక్కుతుంటారు. ప్రయాణికులు బస్సుల కోసం నిరీక్షించే సమయాల్లో వీరికి సరైన షెల్టర్ సదుపాయం లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కుంటున్నారు. షాపుల అరుగుల పైనా దుకాణాల ఎదుట నిలిచి ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ ప్రయాణికులు బస్సుల కోసం నిరీక్షించాల్సి వస్తుంది. దీంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ప్రయాణికులు వాపోతున్నారు. అధికారులు స్పందించి ఈ జంక్షన్‌లో బస్‌షెల్టర్ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని తణుకువాడ మాజీ సర్పంచ్‌లు దెయ్యాల వెంకటరమణ, వాసంశెట్టి శ్రీనివాస్, పితాని ఆదినారయణ, గాంధీ తదితర ప్రయాణికులు కోరుతున్నారు.

ముస్లిం మత గురువు సయ్యద్ అహ్మద్ కన్నుమూత



సయ్యద్ అహ్మద్ (ఫైల్)

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామకు చెందిన ముస్లిం మత గురువు సయ్యద్ అహ్మద్ (82) సోమవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన వెలంపాలెంలోని షాబాజియా జామియా మసీదులో 1968 నుంచి 2020 వరకు మసీదు ఇమామ్‌గా బాధ్యతలు నిర్వహించారు. ఆయన మృతికి రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, ఎంపీ పిల్లి సుభాష్‌చంద్రబోస్, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు సంతాపం తెలిపారు. వైస్ ఎంపీపీ నరాల రాజ్యలక్ష్మి, మండల కోఆప్షన్ సభ్యుడు షేక్ అహ్మద్ అలీషా, మసీదు మత గురువులు మీర్జా అస్కరీ హుస్సేన్, మహ్మద్ తసదుఖ్ హుస్సేన్, మహ్మద్ గుల్బారజా ఆలం, వక్ఫ్ బోర్డు జిల్లా కార్యదర్శి జాఫర్ హుస్సేన్, వెలంపాలెం మసీదు కమిటీ అధ్యక్షుడు ఫాజిల్ అజారుద్దీన్, ముస్లిం మత పెద్దలు అబ్దుల్ ఘనీ, ఖాజా మొహిద్దీన్ తదితరులు పార్థివదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు.

నేటి నుంచి స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు

రాయవరం: జిల్లా వ్యాప్తంగా మంగళ, బుధవారాల్లో స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహిస్తున్నారు. జిల్లాలో ఉన్న 123 స్కూల్ కాంప్లెక్స్‌ల పరిధిలో విధులు నిర్వర్తిస్తున్న ఉపాధ్యాయులకు వృత్యంతర శిక్షణలో భాగంగా ప్రతి నెలా స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను నిర్వహిస్తున్నారు. ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు, 6-8 తరగతులు బోధించే ఉపాధ్యాయులకు వేర్వేరుగా స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. జిల్లా విద్యాశాఖ పర్యవేక్షణలో నిర్వహించే ఈ సమావేశాలను జిల్లా విద్యాశాకాధికారి ఎం.కమలకుమారి, సమగ్ర శిక్షా సెక్టోరల్ అధికారులు, మండల విద్యాశాకాధికారులు పర్యవేక్షించనున్నారు.

కమిటీదే పూర్తి బాధ్యత

రాయవరం: వినాయక విగ్రహాల నిమజ్జనాల్లో ఎటువంటి ఘర్షణలు తలెత్తకుండా కమిటీ నాయకులే పూర్తి బాధ్యత తీసుకోవాలని రాయవరం ఎస్సై జి.నరేష్ సూచించారు. సోమవారం విలేకరులతో మాట్లాడుతూ ఊరేగింపులో డీజే బాక్సులు ఉపయోగించకూడదని, అశ్లీలనృత్యాలు ఏర్పాటు చేయరాదన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే కమిటీ సభ్యులపై కేసులు నమోదు చేస్తామన్నారు. ఐదు గంటల లోపు వినాయక నిమజ్జనాలు చేపట్టాలన్నారు. పోలీసులు నిర్దేశించిన ప్రదేశాల్లోనే నిమజ్జనాలు చేసుకోవాలన్నారు. కమిటీ సభ్యులు పూర్తి అప్రమత్తంగా ఉండాలన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో యువకుడి మృతి

అయినవిల్లి: నేదునూరులో ఓ యువకుడు విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఆదివారం రాత్రి మృతి చెందాడు. దీనికి సంబంధించి స్థానిక ఎస్సై ఎస్.నాగేశ్వరరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అయినవిల్లి మండలం నేదునూరుకి చెందిన ఇండుగుల వెంకట్రామయ్య మిల్లు వద్ద సిమెంట్ పనులు చేస్తున్న దుబా సాయి (23) విద్యుత్ మోటార్‌ను ఆన్ చేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. దీనిపై మృతుడు తండ్రి ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీయాలి

డీఈవో కమలకుమారి



కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఈవో కమలకుమారి

మండపేట: ప్రతి విద్యార్థిలో ఏదో ఒక అంశంలో సృజనాత్మకత దాగి ఉంటుందని, దానిని వెలికితీసేలా ఉపాధ్యాయులు వారిని ప్రోత్సహించాలని జిల్లా విద్యాశాకాధికారి ఎం.కమలకుమారి పిలుపునిచ్చారు. స్థానిక మండల పరిషత్ సమావేశపు హాలులో ఎంఈవోలు నాయుడు రామచంద్రరావు, సీహెచ్‌వీ సోమిరెడ్డిల ఆధ్వర్యంలో సోమవారం అరబిందో సొసైటీ ఆధ్వర్యంలో రూపాంతర శిక్షణ, నూతన ఆవిష్కరణలపై మూడు మండలాల ఉపాధ్యాయులకు సమావేశం నిర్వహించారు. సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న డీఈవో కమలకుమారి మాట్లాడుతూ విద్యార్థుల్లో మానసిక ఒత్తిడిని తొలగించేందుకు రూపాంతర శిక్షణ ఉపకరిస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధికి ఎంతో కృషి చేస్తోందని, ప్రభుత్వ కృషికి, స్వచ్ఛంద సంస్థల కృషి కూడా తోడైతే మరింత విద్యాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. విద్యార్థులకు రూపాంతర శిక్షణ సద్వినియోగమయ్యేలా ఉపాధ్యాయులు పర్యవేక్షించాలన్నారు. ఉపాధ్యాయులు కూడా నిరంతర విద్యార్థిగా ఉన్నప్పుడే విద్యార్థులను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడం సాధ్యమవుతుందన్నారు. ఏఎంవో పి.రాంబాబు మాట్లాడుతూ అరబిందో సొసైటీ ద్వారా మండపేట, రాయవరం, కపిలేశ్వపురం మండలాల్లో ఎంపిక చేసిన 50 పాఠశాలల్లో విద్యార్థులకు ఇన్నోవేటివ్ కార్యక్రమాలు నిర్వహిస్తారన్నారు. అలాగే బోధనలో ఇన్నోవేటివ్ పద్ధతులను అవలంబించి విద్యాభివృద్ధికి కృషి చేసే ఉపాధ్యాయులను గుర్తించి, ఏటా ఢిల్లీలో సత్కరించనున్నట్టు తెలిపారు. అరబిందో సొసైటీ స్టేట్ కోఆర్డినేటర్ జి.వెంకటచైతన్య, డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ వెంకట్‌వినోద్‌లు అరబిందో సొసైటీ ద్వారా విద్యార్థులు ఆరోస్ స్కాలర్‌షిప్స్ పొందే విధానాన్ని వివరించారు. ఇంక్లుజివ్ ఎడ్యుకేషన్, ఇన్నోవేటివ్ పాఠశాల యాప్‌ను ఉపాధ్యాయులతో డౌన్‌లోడ్ చేయించారు. సమావేశంలో సమగ్ర శిక్షా ఐఈ కోఆర్డినేటర్ ఎంవీవీ సత్యనారాయణ, ఎంఈవోలు పి.లక్ష్మణమూర్తి, కె.తాతారావు, రాయవరం,మండపేట, కపిలేశ్వరపురం మండలాలకు చెందిన ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గణపతి హోమం



హోమంలో పాల్గొన్న ఆర్యవైశ్య సంఘం సభ్యులు



హోమంలో పాల్గొన్న భక్తులు

కపిలేశ్వరపురం: గణపతి నవరాత్ర ఉత్సవాలను పురస్కరించుకొని అంగర గ్రామ ఆర్య వైశ్య సంఘ సభ్యుల ఆధ్వర్యంలో సోమవారం వాసవీ కన్యకాపరమేశ్వరి కల్యాణ మండపంలో గణపతి హోమం నిర్వహించారు. అంగర, పడమర ఖండ్రిక గ్రామాల భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. స్వామి తీర్థ ప్రసాదాలను భక్తులకు అందజేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్ష, కార్యదర్శిలు దాసరి చిన్నరాజు, కాళ్ళకూరి పనసరామన్న, నాయకులు కాళ్ళకూరి ప్రవీణ్‌కుమార్, సభ్యులు పాల్గొన్నారు.

రాయవరం: వెదురుపాక సప్తా సెంటర్‌లో సోమవారం లక్ష్మీగణపతి హోమాన్ని వైభవంగా నిర్వహించారు. వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని లక్ష్మీగణపతి హోమం, స్వామి వారికి గరికపూజ నిర్వహించారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో వినాయకుడికి వివిధ రకాల ద్రవ్యాలతో అభిషేకాలు చేశారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ ప్రతినిధులు కొవ్వూరి బులివీర్రెడ్డి, భామిరెడ్డి, సతీష్‌రెడ్డి, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతి



పండిట్ దీనదయాళ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సత్యనారాయణ తదితరులు



దీన్ దయాళ్ ఉపాధ్యాయ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కర్రి చిట్టిబాబు తదితరులు

మండపేట: పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ జయంతిని సోమవారం మండపేటలో ఘనంగా నిర్వహించారు. స్థానిక టౌన్‌హాలు వద్ద బీజేపీ నేతలు కోన సత్యనారాయణ, కేవీవీ సాయిరాం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జనసంఘ ప్రధాన కార్యదర్శిగా, జనసంఘ్ అధ్యక్షునిగా ప్రజాసంక్షేమానికి దీనదయాళ్ ఎనలేని సేవలందించారన్నారు. పార్టీ నాయకులు ఎస్ భద్రరావు, కె అప్పారావు, కె శ్రీనివాస్ పాల్గొన్నారు.

కె.గంగవరం: మండలంలోని కోటిపల్లి విజ్ఞాన భారతి పాఠశాలలో సోమవారం దీన్ దయాళ్ ఉపాధ్యాయ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు కర్రి చిట్టిబాబు, దంగేటి మాచరరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి.శ్రీవిష్ణు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

అంబాజీపేట: మద్యానికి బానిసై ఓ వ్యక్తి గుళికలు తీసుకుని అమలాపురం ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పండువారిపేటకు చెందిన నేదునూరి నాగేశ్వరరావు (40) మద్యానికి బానిసై కుటుంబాన్ని పట్టించుకోవడం లేదని అతని కుటుంబీకులు ప్రశ్నించడంతో మనస్థాపానికి గురై ఈనెల 24న ఇంటి నుంచి వెళ్లి పోయాడన్నారు. నాగేశ్వరరావు ఎంతకీ ఇంటికి రాకపోవడంతో చుట్టుపక్కల వెతుకుతుండగా సమీప ఏటిగట్టుపై పడుకుని ఉన్నాడన్నారు. అతడిని ఇంటికి తీసుకువచ్చిన తరువాత నోటి నుంచి నురగలు రావడంతో మృతుడిని విచారించగా గుళికలు తీసుకున్నట్లు చెప్పాడన్నారు. స్థానికులు, కుటుంబ సభ్యులు అమలాపురం ఏరియా ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడన్నారు. మృతుడు కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎ.చైతన్యకుమార్ తెలిపారు.

నేడు వలంటీర్ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు

రామచంద్రపురం రూరల్: మండలంలోని యనమదల, ద్రాక్షారామ, వెల్ల, తాడిపల్లి, చోడవరం, తోటపేట, వెలంపాలెం, బాపనయ్యచెరువు గ్రామాల్లో ఖాళీగా ఉన్న వలంటీర్ పోస్టులు భర్తీ చేసేందుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు నేటి ఉదయం 10.30 గంటలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్టు ఎంపీడీఓ ఎన్.షెలత్‌రాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాల్సిందిగా సూచించారు.

రేపు డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా

మండపేట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 27వ తేదీన జాబ్‌మేళా జరగనున్నట్టు ప్రిన్సిపాల్ టీకేవీ శ్రీనివాసరావు తెలిపారు. లక్ష్మీ హోండా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాబ్‌మేళాలో మండపేట, అనపర్తి, రామచంద్రపురంలో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేసేందుకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. మంచి వేతనంతో పాటు పదోన్నతలు కూడా ఉంటాయని నిర్వాహకులు తెలిపారన్నారు. డిగ్రీ పాస్ లేదా ఫెయిల్ అయిన ఆసక్తి కలిగిన అభ్యర్థులు బుధవారం ఉదయం 9.30 గంటలకు డిగ్రీ కళాశాలలో హాజరుకావాలని సోమవారం ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు కోరారు. ప్లేస్మెంట్ ఆఫీసర్ సీహెచ్ త్రినాథ్, వైస్ ప్రిన్సిపాల్ ఎ.ఆనందరావు పాల్గొన్నారు.

కుంగ్‌ఫూ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



కుంగ్‌ఫూ పోటీల్లో బెల్టులు సాధించిన విద్యార్థులో రాజుబాబు తదితరులు

మండపేట: హైదరాబాద్ కోట్ల విజయభాస్కరరెడ్డి స్టేడియంలో సుమన్ షోటోఖాన్ కరాటే అకాడమి నిర్వహించిన 21వ నేషనల్ ఓపెన్ కరాటే, కుంగ్‌ఫూ చాంఫియన్ షిప్ పోటీల్లో మండపేట విద్యార్థులు సత్తా చాటారు. స్థానిక న్యూ డ్రాగన్ చైనీస్ కుంగ్‌ఫూ గ్రాండ్ మాస్టర్ పిట్టా రాజుబాబు శిష్యులు పలు విభాగాల్లో ప్రతిభ కనబర్చి మెడల్స్ సాధించారు. పర్పుల్ బెల్ట్ విభాగంలో పి.హనీత్, బ్రౌన్ బెల్ట్ విభాగంలో ఎం.నవ్య, ఆరెంజ్ బెల్ట్ విభాగంలో ఎండీ సాయి, ఎల్లో బెల్ట్ విభాగంలో గడి చెర్విక్ రామ్, జి.సిద్దులు మొదటి స్థానాలు కైవసం చేసుకోగా వైట్ బెల్ట్ విభాగంలో టి.పార్థు రెండో స్థానం సాధించారని రాజుబాబు తెలిపారు. సోమవారం న్యూ డ్రాగన్ చైనీస్ కుంగ్‌ఫూ సంస్థ కార్యాలయం వద్ద విజేతలను రాజుబాబు అభినందించారు.

15 నుంచి పీఠంలో శరన్నవరాత్ర ఉత్సవాలు

రాయవరం: వెదురుపాక విజయదుర్గా పీఠంలో వచ్చే నెల 15వ తేదీ నుంచి 23వ తేదీ వరకు 52వ శరన్నవరాత్ర ఉత్సవాలను నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు సోమవారం విలేకరులకు తెలిపారు. పీఠాధిపతి వాడ్రేవు వెంకటసుబ్రహ్మణ్యం(గాడ్) సమక్షంలో అమ్మవారి అవతారాల కరపత్రాన్ని ఆయన విడుదల చేశారు. 15న రచత కవచ అలంకరణ, 16న బాలాత్రిపుర సుందరి, 17న గాయత్రిదేవి, 18న అన్నపూర్ణదేవి, 19న మహాలక్ష్మీదేవి, 20న సరస్వతీదేవి, 21న లలితా త్రిపురసుందరీదేవి, 22న దుర్గాదేవి, 23న ఉదయం మహిషాసురమర్దిని, సాయంత్రం రాజరాజేశ్వరిదేవి అవతారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిస్తారన్నారు. 20న చిన్నారులచే సామూహిక సరస్వతి పూజలు నిర్వహించనున్నామన్నారు. కార్యక్రమంలో పీఠం పీఆర్వో వి.వేణుగోపాల్, విజయదుర్గా సేవా సమితి ప్రతినిధులు గాదె భాస్కరనారాయణ, సత్యవెంకటకామేశ్వరి, పెదపాటి సత్యకనకదుర్గ, బి.రమ పాల్గొన్నారు.

భీమేశ్వరాలయంలో అలరించిన నృత్య ప్రదర్శన



ద్రాక్షారామ భీమేశ్వరాలయ ప్రాంగణంలో చిన్నారుల నృత్య ప్రదర్శన

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని ప్రసన్నాంజనేయస్వామి ఆలయం వద్ద గణపతి నవరాత్రుల్లో భాగంగా సోమవారం శ్రీసూర్య నృత్యనికేతన్ ఆధ్వర్యంలో నిర్వహించిన నృత్య ప్రదర్శనలో చిన్నారులు భవిష్య, త్రివిష్యల నృత్యాలు ఆహుతులను విశేషంగా అలరించాయి. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం



బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న పశు వైద్య సిబ్బంది

కె.గంగవరం: స్థానిక పశు వైద్యశాలలో రోజుకూలీగా పనిచేస్తున్న బూరయ్య ఆకస్మికంగా గుండెపోటుతో మృతి చెందడంతో కోనసీమ, రామచంద్రపురం, కె.గంగవరం పశు వైద్య సిబ్బంది రూ.1,20,000 ఆర్థిక సాయంగా అతని కుటుంబానికి అందజేశారు. ఈ సొమ్మును జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ, రామచంద్రపురం డివిజన్ సహాయ సంచాలకులు డాక్టర్ ఒ.రామకృష్ణ, పశు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.